ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు



కడచూపుకెళ్లి...

● ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న కారు..

● ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత

● అందరూ రిటైర్డ్ ఉద్యోగులే.. మదనపల్లెలో విషాదం

అనంతలోకాలకు...

మదనపల్లెకు చెందిన ఓ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. తమ్ముడి అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తూ అనంతలోకానికి చేరుకున్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం, పైగా అందరూ వివిధ శాఖలు, హోదాల్లో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగులు కావడం అందరినీ బాధిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలో ఆగి ఉన్న వ్యాన్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే చనిపోయారు.



నుజ్జయిన కారులో అన్నదమ్ముల మృతదేహాలు

మదనపల్లె అర్బన్/కదిరి, మే 11 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు అన్నదమ్ములు. వేర్వేరు ఉద్యోగాలు చేసి రిటైరయ్యారు. శేష జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. బంధువు, వరుసకు తమ్ముడు మరణించడంతో కడచూపు చూసేందుకు వెళ్లారు. అంత్యక్రియలు ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ముగ్గురు అన్నదమ్ములను కబళించింది. మదనపల్లెలో ఆదివారం నెలకొన్న ఈ విషాదకర సంఘటన ఇదీ.. మదనపల్లె పట్టణం రాటకొండవీధికి చెందిన మల్లిశెట్టి నాగేంద్ర (68), మల్లిశెట్టి జయచంద్ర (72), మల్లిశెట్టి చలపతి (74) అన్నదమ్ములు. జయచంద్ర రిటైర్డ్ ఏఎస్ఐ, నాగేంద్ర స్థానిక బీటీ కళాశాలలో రిటైర్డ్ లెక్చరర్, చలపతి కూడా రిటైర్డ్ ఏఎస్ఐ. వీరిలో జయచంద్ర, నాగేంద్రలు మదనపల్లెలో నివాసం ఉండగా చలపతి మాత్రం తిరుపతిలో కాపురం ఉంటున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముగ్గురు అన్నదమ్ములతో పాటు వారి బంధువు, నెల్లూరు నగరానికి చెందిన వేణుగోపాల్ కలిసి కారులో మదనపల్లి నుంచి అనంతపురం వెళ్లారు. అక్కడ చిన్నాన్న కుమారుడు గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున



జయచంద్ర (ఫైల్)



నాగేంద్ర (ఫైల్)



చలపతి (ఫైల్)

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యాన్‌ను రోడ్డు పక్కన ఆపేశారు. అన్నదమ్ములు వెళ్తున్న కారు శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి వద్ద ముంబై-చెన్నై రహదారి పక్కన ఆపి వున్న వ్యాన్‌ను వెనుక వైపున ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లింది. వ్యాన్‌ను బలంగా ఢీకొట్టడంతో అన్నదమ్ములు జయచంద్ర, నాగేంద్ర, చలపతి సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. వేణుగోపాల్ తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. ప్రమాద స్థలాన్ని సీఐ నాగేంద్ర, ఎస్ఐ మునీర్ అహమ్మద్ పరిశీలించారు. మృతదేహాలను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మృతి చెందిన నాగేంద్ర భార్య సౌభాగ్య మదనపల్లె మండలం సీటీఎం జడ్పీ హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు బాలసుబ్రహ్మణ్యం కెనడాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా కుమార్తె ప్రియాంక అమెరికాలో ఉంటున్నారు. జయచంద్రకు భార్య శారద, కుమార్తె ఉషశ్రీ, కుమారుడు వెంకటనరేష్ ఉన్నారు. వీరిలో కుమార్తె ఉషశ్రీ స్థానికంగా ప్రైవేటు స్కూల్‌లో, కుమారుడు వెంకటనరేష్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. అలాగే చలపతికి భార్య లక్ష్మి..కుమార్తె నీలిమ, కుమారులు సురేష్, ప్రశాంత్‌లు ఉన్నారు. వీరిలో సురేష్ హైదరాబాద్‌లో, ప్రశాంత్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఉన్నతమైన కుటుంబానికి చెందిన వీరంతా ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అయితే అనుకోని సంఘటనతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఆయా శాఖలో తమతో పాటు పనిచేసిన సహచర ఉద్యోగులు, బంధువులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో మదనపల్లెలో విషాదం నెలకొంది.



రోడ్డుపై ఆగి ఉన్న వ్యాన్

వైభవంగా బిందె సేవ



భువనగిరిపల్లె వీధుల్లో నిర్వహిస్తున్న బిందెసేవ

రాజంపేట టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఉదయం బిందె సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామ పురవీధుల్లో బిందెసేవ మహోత్సవాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను చూసేందుకు రాజంపేట పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, లక్ష్మీనరసయ్య, నరసింహ, హరి, రఘుపతి, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.


రూ.10 కోట్లతో సీసీ రోడ్లు

● కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిన ఎమ్మెల్యే

పీలేరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పీలేరు నియోజకవర్గంలో రూ.10 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలను ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కలెక్టర్, డ్వామా పీడీలకు ప్రతిపాదనలు పంపారు. నియోజకవర్గంలో మండలాల వారీగా గుర్రంకొండలో 33 పనులకు రూ.1.40 కోట్లు, కలకడలో 21 పనులకు రూ.1.25 కోట్లు, కలికిరిలో 38 పనులకు రూ.1.35 కోట్లు, కేవీపల్లెలో 15 పనులకు రూ.కోటి, పీలేరులో 75 పనులకు రూ.3 కోట్లు, వాల్మీకిపురంలో 32 పనులకు రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో 214 పనులకు రూ.10 కోట్లతో ఎమ్మెల్యే ప్రతిపాదనలు పంపారు.

పుష్కరిణిలో స్వామి విహారం

కడప కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): దేవునికడప శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి తెప్పోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు దేవునికడపలోని పుష్కరిణిలో శ్రీదేవి భూదేవి సమేత స్వామి తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున పుష్కరిణి వద్దకు హాజరై స్వామి అమ్మవార్లను కనులారా వీక్షించి తరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టరు ఈశ్వర్‌రెడ్డి, ఆలయ అర్చకులు క్రిష్ణమోహన్, రఘునందన్, తరుణ్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొని అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారిని పుష్కరిణిలో ఊరేగించారు.



తెప్పోత్సవంలో వెంకటేశ్వరస్వామి

బ్రహ్మోత్సవాలకు వెళుతూ ట్రాలీ ఆటో బోల్తా

● 35 మందికి గాయాలు ● అందులో 10 మందికి తీవ్ర గాయాలు

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా రాపూరు మండలం గోనుపల్లి గ్రామం వద్ద ఆదివారం సుమారు 35 మందితో ప్రయాణిస్తున్న ట్రాలీ ఆటో బోల్తా పడి పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం పెరియవరం గ్రామానికి చెందిన పెంచలస్వామి భక్తులు కోన బ్రహ్మోత్సవాలకు వస్తుండగా రాపూరు మండలం గోనుపల్లి వద్ద మోటార్ బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న సుమారు 35 మందికిపైగా గాయాలు కాగా, 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి.క్షతగాత్రులను 108 వాహనాల ద్వారా రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో శివయ్య (42), రాధమ్మ (30), నారాయణమ్మ (60) పరిస్థితి విషమంగా ఉండడంతో గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రాపూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.



ప్రమాదంలో గాయపడినవారు

వైసీపీ నేత ఇంట్లో 10 టన్నుల రేషన్ బియ్యం

● రాయచోటికి తరలిస్తుండగా పట్టుకున్న పీలేరు పోలీసులు ● కేసు నమోదులో మల్లగుల్లాలు

పీలేరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు, రెండు కాదు. ఏకంగా 10 టన్నుల రేషన్ బియ్యం. అదీ వైసీపీ నాయకుడి ఇంట్లో పట్టుబడిన సంఘటన ఆదివారం పీలేరులో జరిగింది. బహిరంగ మార్కెట్‌లో రీసైక్లింగ్ కోసం పీలేరు పరిసర ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలు, సాధారణ ప్రజల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని ఆదివారం పీలేరు పోలీసులు పట్టుకున్నారు. దీంతో ఈ సంఘటన ఆదివారం పీలేరులో చర్చనీయాంశమైంది. పీలేరు పట్టణం కామాటంవారిపల్లెలోని మూతపడిన పాలశీతలీకరణ కేంద్రం ఎదురుగా ఉంటున్న దేవేంద్ర ఇంటిలో పోలీసులు బియ్యంతో పాటు దానిని తరలిస్తున్న ఒక ఐచర్ లారీ, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వైసీపీ నాయకుడైన దేవేంద్ర కొంతకాలంగా అక్రమ బియ్యం వ్యాపారం సాగిస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగిన ఆయన వ్యాపారం కూటమి ప్రభుత్వం కొలువు దీరాక కూడా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అతని ఇంటి నుంచి 10 టన్నుల రేషన్ బియ్యాన్ని రాయచోటికి తరలిస్తుండగా పీలేరు పోలీసులు పట్టుకున్నారు. రాయచోటి, చిత్తూరు నుంచి అందిన రహస్య సమాచారం మేరకు ఆ బియ్యాన్ని పట్టుకున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే దేవేంద్రతో పాటు రాయచోటిలోని అతని వ్యాపార భాగస్వామి పరపతి కారణంగా కేసు నమోదులో పీలేరు పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది. దేవేంద్ర ఇంటి వద్ద ఉన్న వాహనాలను ఆదివారం ఉదయం 11 గంటలకు స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినప్పటికీ ఆదివారం రాత్రి వరకు కేసు నమోదు చేయడానికి పోలీసులు వెనకడుగు వేశారు. వ్యాపార నిర్వహణలో భాగంగా వారు పీలేరు నుంచి రాయచోటి వరకు అటు పోలీసు, రెవెన్యూ, అధికార పార్టీ నాయకులకు నెలవారీ మామూళ్లు చెల్లిస్తున్నారని, మామూళ్లు పుచ్చుకున్న వారు కేసు చేయకుండా పోలీసులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దేవేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినప్పటికీ కేసు నమోదు అవుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమ లావాదేవీల్లో దిట్ట అయిన దేవేంద్ర పీలేరుతో పాటు పొరుగున్న కేవీ పల్లె, రొంపిచెర్ల, సదుం, సోమల మండలాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి కామాటంవారిపల్లెలోని తన ఇంటిలో డంప్ చేసుకుంటూ ఉంటాడు. అనుకూలమైన సమయంలో రాయచోటితో పాటు కర్ణాటకలోని పలు ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటూ ఉంటాడు. అతనిపై గతంలో ఇదే అంశంలో పలుమార్లు పీలేరులోనే కేసులు నమోదయ్యాయి. ఈ విషయంపై పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ బాలకృష్ణలను వివరణ కోరగా బియ్యాన్ని పట్టుకున్న మాట వాస్తవమేనని, కేసు కూడా నమోదు చేస్తామని తెలిపారు.



దేవేంద్ర ఇంటి వద్ద ఉన్న మినీ లారీ, ఆటో

భలే అల్లరోడే మహాపండితుడాయే...

● మానవతావాది...

7

బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నమయ్య

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

● మాతృశ్రీ వెంగమాంబకు పుష్పాంజలి

గుర్రంకొండ, మే 11 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆదివారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. నరసింహస్వామి జయంతి సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మాతృశ్రీ వెంగమాంబకు ఘనంగా పుష్పాంజలి కార్యక్రమాన్ని చేశారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం కావడంతో ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు అర్చకులు, స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు కన్నులపండువగా చేశారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు స్వామి వారికి కొబ్బరికాయలు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, గోకుల్, వెంకీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



నరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

నేటినుంచి అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు



ఉత్సవాల సందర్భంగా అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

రాజంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు ఈనెల 12వ తేదీ సోమవారం నుంచి 14వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో శ్యామలరావు, అన్నమాచార్యుల ప్రాజెక్టు సంచాలకులు కె.రాజగోపాలరావు, అన్నమాచార్య ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మేడసాని మోహన్ ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు నిర్వహించనున్నట్లు ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. తాళ్లపాక గ్రామంలోని ధ్యానమందిరం, అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక ముఖద్వారం వద్ద ఉన్న 108 అడుగుల విగ్రహం వద్ద, తిరుపతి మహతి ఆడిటోరియం, అన్నమాచార్యుల కళామందిరం వద్ద ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 12వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు తాళ్లపాక గ్రామంలోని అన్నమాచార్య ధ్యానమందిరం ఆవరణంలో శ్రీనివాస కల్యాణం జరగనుంది. ఇదేరోజు అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద సాయంత్రం 6.30 గంటలకు శ్రీవారి ఊంజల సేవ కార్యక్రమం జరగనుంది. 7.30 గంటలకు తిరుపతికి చెందిన కౌసల్య బృందంచే హరికథ, 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన ఆర్.శ్యామ్‌కుమార్, హేమమాలిని బృందంచే సంగీత సభ, 7 గంటలకు అన్నమయ్య సేవా సంస్కృతి బృందంచే నృత్యం జరగనుంది. 14న సాయంత్రం సంగీతసభ, కోదండరామ కళా నాట్యమండలిచే నాటకం ఉంది. తాళ్లపాక ధ్యానమందిరం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే గోష్ఠిగానం, సప్తగిరి సంకీర్తనలు ఉంటాయి. ఉదయం 10.30 గంటలకు శ్రీనివాస కల్యాణం జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు సంగీతసభ, హరికథ కార్యక్రమం ఉంటుంది.



అన్నమయ్య ధ్యానమందిరం ఆవరణంలో జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

సోషల్ మీడియాలో పోస్టుల విషయమై జాగ్రత్త: సీఐ

సిద్దవటం, మే 11 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు సూచించారు. ఆదివారం సిద్దవటం పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సున్నితమైన అంశాలపై అప్రమత్తత అవసరమన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసేటప్పుడు నిజానిజాలు పరిశీలించాలని కోరారు. ఫేక్ పోస్ట్‌లు పెడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫి, పోలీసులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

ఓబులవారిపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సచివాలయంలో ఆధార్ సేవలను వినియోగించుకోవాలని ఎంపీడీవో మల్‌రెడ్డి తెలిపారు. ఆధార్‌లో మార్పులు చేర్పులు, పుట్టిన తేదీ, ఫొటో మార్పు, బయోమెట్రిక్ వంటి సేవలను వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

మడితాటి నరసింహారెడ్డికి పదోన్నతి



సంబేపల్లె, మే11(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మడితాటి నరసింహారెడ్డికి సీనియర్ లెక్చరర్‌గా పదోన్నతి కల్పిస్తూ రాయచోటి డైట్ కళాశాలకు బదిలీ చేశారు. వివిధ పాఠశాలల్లో 13 సంవత్సరాలు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా, 16 సంవత్సరాలు ప్రధానోపాధ్యాయుడిగా ఆయన పనిచేశారు. మన టీవీలో పాఠ్యాంశ బోధకుడిగా, ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయితగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఇకపై ఆయన రాయచోటి డైట్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమన్‌టీస్ విభాగంలో సీనియర్ లెక్చరర్‌గా సేవలించనున్నారు.

ప్రజాసేవలో మానవతా సంస్థ

సంబేపల్లె, మే11(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టడమే తమ కర్తవ్యం అని మానవతా సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, అధ్యక్షుడు గాండ్లపెంట ఖాదర్‌బాషా, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, కన్వీనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆదివారం శెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రాయచోటి మానవతా సంస్థ ఆధ్వర్యంలో వెంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ తిరుపతి వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్యులు సుధీర్, వైద్యురాలు భావనలు వైద్య పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్సకు అర్హులైన వారిని గుర్తించి ఉచిత రవాణా సౌకర్యంతో పాటు ఆపరేషన్ చేస్తామన్నారు. మానవతా సంస్థ సెక్రటరీ జయచంద్రారెడ్డి, కోచైర్మెన్ షకీల్, మాజీ సెక్రటరీ వెంకట్రమణనాయుడు, సుదర్శన్‌రెడ్డి, పీరయ్య, భోజనపు శివరామకృష్ణ, సీఆర్‌పీ ఖాజావలి, కంటి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుకా యల్లమ్మ తిరునాళ్లు

సిద్దవటం, మే 11 (ఆంధ్రజ్యోతి) : మాచుపల్లెలో వెలిసిన జగజ్జనని రేణుకా యల్లమ్మ అమ్మవారి తిరునాళ్లను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలు ఈనెల12 నుంచి 16వ తేదీ వరకు జరుగుతాయని వారు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

హెల్మెట్ తప్పనిసరి

ఒంటిమిట్ట, మే 11 (ఆంధ్రజ్యోతి) : స్కూటర్‌పై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ బాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం మండపంపల్లె హైవేలో వాహనాలు తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు ఇచ్చారు. వాహనదారులు రికార్డులు సక్రమంగా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ గ్రంథాలయం.. అలంకారప్రాయం

● పట్టించుకోని గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారులు



రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో ఉన్న జిల్లా గ్రంథాలయం

రాయచోటిటౌన్, మే11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఉన్నా లేనట్టే. సాధారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు గ్రంథాలయాన్ని తెరిచి ఉంచాలి. ప్రతి శుక్రవారం సెలవు మినహా మిగిలిన రోజులంతా గ్రంథాలయాన్ని తెరిచి ఉంచాలి. అయితే గ్రంథాలయం తెరుస్తున్నారా, రోజుకు ఎంత మంది పుస్తక ప్రియులు అక్కడికి వెళ్తున్నారనే సమాచారం కూడా పూర్తి స్థాయిలో లేదు. అయితే పట్టణ ప్రజలకు గ్రంథాలయం అందుబాటులో లేకపోయినప్పటికీ మున్సిపల్ అధికారులు మాత్రం పన్నులు వసూలు చేస్తుండటంతో పుస్తక ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం

రాష్ట్ర గ్రంథాలయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.ఎంతో మంది మేధావులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, చిన్నారులు, మహిళలు గ్రంథాలయానికి వచ్చి కథల పుస్తకాలతో పాటు, మహాభారతం, రామాయణం, భగవద్గీత, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, వార్తా పత్రికలను చదువుతారు. పట్టణానికి నడిబొడ్డున ఉన్న గ్రంథాలయాన్ని పట్టణానికి చివరి భాగంలో ఉన్న ఎస్ఎన్‌కాలనీలో ఏర్పాటు చేయడంతో అక్కడికి రిటైర్డ్ ఉద్యోగులు, చిన్నారులు వెళ్లే పరిస్థితి లేదు. గ్రంథాలయం అందుబాటులో లేక పోవడంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు విజ్ఞానానికి దూరమవుతున్నారు. అధికారులు సైతం జిల్లా గ్రంథాలయాన్ని పుస్తక ప్రియులకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో ఉన్న జిల్లా గ్రంథాలయం పుస్తక ప్రియుల కోసమో లేక గ్రంథాలయ అధికారులకు అనుకూలంగా ఉండడం కోసమో అనేది అర్థం కావడం లేదని పట్టణ ప్రజలు రాష్ట్ర గ్రంథాలయశాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పుస్తక ప్రియులు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా పట్టణ నడిబొడ్డున గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

అమర వీరుడు మురళీనాయక్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు



మురళీనాయక్ అంత్యక్రియల్లో కోడూరు ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

రైల్వేకోడూరు, మే 11(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన అగ్నివీర్ జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి రైల్వేకోడూరులో సీపీఐ నాయకులు తుమ్మల రాధాక్రిష్ణ, జ్యోతి చిన్నయ్య, పండుగోల మణి, దార్ల రాజశేఖర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల జరిగే నష్టం గురించి డాక్టర్ కే. నారాయణ మాట్లాడిన విషయాలను బీజేపీ నాయకులు వక్రీకరించడం సరికాదన్నారు. ఉగ్రవాదుల సంస్థల పైనే యుద్ధం చేయాలి కానీ దేశాల మీద దేశాలు యుద్ధాలు చేసుకుంటూ పోతే సామాన్య ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా దేశానికి తీరని నష్టం ఏర్పడుతుందన్నారు. సీపీఐ నాయకులు తమ్మల క్రిష్ణచైతన్య, పి.మురళి, ఎం.గంగాధర్, ఎస్. సరోజనమ్మ పాల్గొన్నారు.

మురళీనాయక్ అంత్యక్రియల్లో ప్రముఖులు

రైల్వేకోడూరు, మే 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీనాయక్ అంత్యక్రియలకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లతో పాటు రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురళీనాయక్ వీరోచిత పోరాటాన్ని యావత్ భారత దేశం ఎన్నటికీ మర్చిపోలేదని కొనియాడారు.

కనువిందుగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం





కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం... ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

లక్కిరెడ్డిపల్లె, మే11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపల్లి పంచాయతీలోని రవీంద్రనగర్‌లో వెలిసిన ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణం ఆదివారం కనువిందుగా జరిగింది. ప్రధాన అర్చకుడు నారాయణశర్మ కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర యువజన, క్రీడాశాఖ మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి స్వామి వారి కల్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. రవిశంకర్‌రెడ్డి దంపతులు స్వామి వారి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. దేవేందర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, సుధీర్‌కుమార్, నాగేంద్రబాబు, దండే వీరయ్య, నరసింహరాజు, ప్రసాద్‌యాదవ్, బాలసుబ్రమణ్యం, ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రయాదవ్, కార్యనిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

సిద్దవటం, మే 11 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలంలోని జేఎంజే కళాశాల ఎదురుగా వెలసిన పెంచల నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం బ్రహ్మోత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ జపం, నరసింహహోమం, సుదర్శన హోమం, లక్ష్మీహోమం, పూర్ణాహుతి, కుష్మాండబలి ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. కాగా కల్యాణంలో పాల్గొనదలచిన వారు రూ.10116 చెల్లించాలన్నారు.

నరసింహస్వామికి వెండి కిరీటాలు వితరణ

పెనగలూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణనెల్లూరు సమీపాన కంభం బోటు గుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి మూలమూర్తులకు నారాయణనెల్లూరు గ్రామానికి చెందిన కట్టా రామక్రిష్ణయ్య, నాగరత్నమ్మ, కట్టా శ్రీనివాసులు, లక్ష్మీగౌరి దంపతులు రూ.30 వేల విలువ చేసే వెండి కిరీటాలను సమర్పించుకున్నారు. గ్రామ పెద్దలు న్యాయవాది వెంకటేశ్వరరాజు, శ్రీరాం, సుబ్బయ్య, కళాచంద్ర పాల్గొన్నారు.

ఈటమాపురంలో....

నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం టెంపుల్ ట్రస్టు వైస్ చైర్మన్ బత్తిన గుండాల్‌రెడ్డి, మహేశ్వరి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత నరసింహస్వామికి కుంభాభిషేకం నిర్వహించారు.

కమనీయం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

సుండుపల్లె, మే11(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా ఆదివారం సుండుపల్లె మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బేరిపల్లిలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణాన్ని అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

అనంతరం ముస్తాబు చేసిన కల్యాణ వేదికపై ఆశీనులను చేసి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కమనీయంగా, కన్నుల పండుగగా కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

ఘనంగా గంగమ్మ జాతర

రైల్వేకోడూరు రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజుపురం గ్రామంలో ఆదివారం గంగమ్మ తల్లి జాతరను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయానే మహిళలు గంగమ్మ తల్లికి పొంగళ్లు అర్పించారు. కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి సతీసమేతంగా పాల్గొని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటమి ప్రభుత్వంలో నియోజక వర్గం అభివృద్ధి పదంలో ముందుకు సాగాలని గంగమ్మ తల్లి ఆశీస్సులు మన అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు తల్లెం రమణరెడ్డి, తిరుపతి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకుల ప్రత్యేక పూజలు



మాజీ సైనికుడిని సన్మానిస్తున్న నాయకులు

ఒంటిమిట్ట, మే 11 (ఆంధ్రజ్యోతి) : సిందూర్ ఆపరేషన్ విజయవంతం కావడంతో స్థానిక కోదండరామాలయంలో ఆదివారం ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు రాజుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు పాటూరు గంగిరెడ్డి, భానుప్రకాష్‌రాజు, ఆర్ఎస్ఎస్ నాయకులు వేణుగోపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు

రాయచోటిటౌన్, మే11(ఆంధ్రజ్యోతి): చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 31 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి,కంటి వైద్యులు సురేష్ బాబు, మహాలక్ష్మి పాల్గొన్నారు.

గుణాత్మక విద్యనందించడమే లక్ష్యం



విద్యార్థులను అభినందిస్తున్న కొండూరు శ్రీనివాసరాజు, అర్చనా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి

రాయచోటిటౌన్, మే11(ఆంధ్రజ్యోతి): గుణాత్మక విద్యనందించడమే రాయచోటి అర్చనా విద్యాసంస్థల లక్ష్యమని పశుసంవర్ధక శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణం గాలివీడు రహదారి వద్దగల అర్చనా విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ డాక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పశుసంవర్ధకశాఖ డిప్లొమా ఉద్యోగ సాధకుల వేడుకలు, కాన్వకేషన్, అకడమిక్ అచీవ్‌మెంట్ 2024 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.50 మంది విద్యార్థులకు కాన్వకేషన్స్‌ను అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ అర్చనా విద్యాసంస్థల్లో వెటర్నరీ, డిప్లొమా కోర్సును అభ్యసించి ఏక ప్రయత్నంలోనే వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు.కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, డైట్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్ పాపిరెడ్డి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆధునీకరించిన సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాజంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) :రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని ఆధునికరించారు. ఈ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం పాత భవనం కాలానుగుణంగా దెబ్బతినడంతో భవనాన్ని మరమ్మతులు చేసి ఆధునీకరించారు. ఈ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ హాజరయ్యారు. రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి, రెవెన్యూ డివిజన్‌కు సంబంధించిన తహసీల్దారు పీర్‌మున్నీ, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలతోనే గ్రామాల అభివృద్ధి

గాలివీడు, మే11(ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం కొర్లకుంట పంచాయతీ మాజీ సర్పంచ్ పేరం నరసింహారెడ్డి ఇచ్చిన విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్‌రియాజ్, మాజీ ఎంపీటీసీ రెడ్డప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, వీరరాఘవులు, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకుడు సీఎం బలరామిరెడ్డి : ముక్కా



నివాళులర్పిస్తున్న ముక్కా

రైల్వేకోడూరు, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవకుడు సీఎం బలరామిరెడ్డి అని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. సోమవారం కడప జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం కడప జిల్లా రైల్వేకొండాపురంలో బలరామిరెడ్డి భౌతికకాయానికి ఆయన నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలరామిరెడ్డి ప్రజాసేవకు అంకితభావంతో పని చేశారన్నారు. టీడీపీ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి'



సీపీఐ రైల్వేకోడూరు కార్యాలయంలో మాట్లాడుతున్న గంగాధర్

రైల్వేకోడూరు రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌర వాధ్యక్షుడు తుమ్మల రాధాక్రిష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, ఏపీఎండీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరి మురళి, ఏఐటీయూసీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి తుమ్మల క్రిష్ణచైతన్య, నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజనమ్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మే11(ఆంధ్రజ్యోతి): ఎంఏ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, లైఫ్ కేర్ క్లినిక్ వారు పేదలకు ఉచితంగా వైద్య సేవలను అందించడం అభినందనీయమని టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఏ వెల్ఫేర్ సొసైటీ, లైఫ్ కేర్ క్లినిక్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన రాష్ట్ర మంత్రి తనయుడు నిశ్చల్‌నాగిరెడ్డితో కలిసి ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు ఎస్ఎండీ అబిద్, ఆసిఫ్, జుబేర్ అహ్మద్, యుగంధర్‌రెడ్డి, కరీముల్లాబాషా, మహమ్మద్‌అలీలు సుమారు 400 రోగాలకు పలు రకాల పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో లైఫ్ కేర్ క్లినిక్ వైద్యులు జక్రియాఅహ్మద్, ఎంఏ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు నహవీల్‌తో పాటు సొసైటీ సభ్యులు, పెద్ద ఎత్తున రోగులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ముక్కా ఫౌండేషన్



వైద్య శిబిరంలో పాల్గొన్న కూటమి నాయకులు

రైల్వేకోడూరు రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి):పేదలకు ఎప్పుడు ముక్కా ఫౌండేషన్ అండగా ఉంటుందని ముక్కా ఫౌండేషన్ డైరెక్టర్ ముక్కా సాయివికాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం బస్టాండ్ వద్ద ఉన్న బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో రేడియంట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ తిరుపతి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకర్గంలో అనేక మెడికల్ క్యాంప్‌లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కోడూరు మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, టీడీపీ యువ నాయకులు అరవింద్, సుకుమార్ రెడ్డి, శివ, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పరుశురామ జయంతి



పరుశురాముడికి పూజలు చేస్తున్న భక్తులు

రైల్వేకోడూరు, మే 11(ఆంధ్ర జ్యోతి): అంకాలమ్మ తిరునాళ్లలో భాగంగా రైల్వేకోడూరు దేవస్థానంలో పరుశురామ జయంతి ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పరుశురాముని విగ్రహాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైసీపీ ఇకనైనా ఫేక్ ప్రచారాలు మానుకోవాలి

● ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగేంద్రనాయుడు

రాయచోటిటౌన్, మే11(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ సొమ్ముతో కుట్టుమిషన్లను కొని పసుపు రంగు వేసి అందిస్తున్నారంటూ నారా లోకేశ్‌పై వైసీపీ చేసిన వ్యాఖ్యలను ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జీ.నాగేంద్రనాయుడు తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నారా లోకేశ్ తన సొంత డబ్బుతో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమిషన్లు, టైలరింగ్ మెటీరియల్ పంపిణీ చేశారన్నారు. నారా లోకేశ్ తన సొంత సొమ్ము కాబట్టి శుభానికి సంకేతమైన పసుపు రంగు మిషన్లు ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని వైసీపీ నేతలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. టీడీపీ రైతు విభాగం రాష్ట్ర నాయకులు నూలివీడు వెంకటశివారెడ్డి, రాజంపేట పార్లమెంట్ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గుడి చెన్నక్రిష్ణారెడ్డి, పూలుకుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జో అచ్యుతానంద... జో జో ముకుందా...
లాలి పరమానంద... రామగోవిందా

అమ్మ పాడే ఈ జోలపాట వింటూ హాయిగా నిద్రపోని బాల్యాన్ని ఊహించగలమా..

చందమామ రావే.. జాబిల్లి రావే..

అమ్మగొంతులోంచి ఈ చల్లని పాట వింటూ గోరుముద్దలు తినని వారెవరైనా తెలుగు నేలమీద ఉంటారా.. ఇటువంటి సంకీర్తన రచనలతో ఆబాలగోపాలాన్ని అలరించిన తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు ఈనెల 12వ తేదీ సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ సందర్భంగా అన్నమయ్యపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



తాళ్లపాక అన్నమయ్య కీర్తిని చాటిచెప్పిన కృష్ణంరాజు స్థూపం

భలే అల్లరోడే.. మహాపండితుడాయె..




- మానవతావాది... బహుముఖ ప్రజ్ఞాశాలి
- నేటి నుంచి తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతి ఉత్సవాలు

రాజంపేట, మే 11(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య చిన్నప్పుడు మహా అల్లరి పిల్లవాడు. ఎప్పుడూ ఆటలూ పాటలే. ఇంట్లో ఎవరికీ అది నచ్చేది కాదు. వదిన మందలింపులు ఎక్కువ. ఒకసారి అన్నమయ్యను గడ్డి కోసుకు రమ్మని అడవికి పంపింది. కాదనలేక వదినను తిట్టుకుంటూ అడవికి వెళ్లాడు. గడ్డి కోస్తుండగా చిటికిన వేలు తెగి రక్తం ధారలై కారింది. ఇష్టం లేని చెప్పిందన్న కోపం... గాయం సలుపుతున్న బాధతో కన్నీటి పర్యంతమయ్యాడు. అదే సమయంలో గోవింద నామస్మరణలు ఆ అడవిలో అన్నమయ్యకు వినిపించాయి. తిరుమలకు కాలినడకన వెళ్తున్న భక్తబృందాలు ఏడుస్తున్న బాలుడిని ఓదార్చి తెచ్చుకున్న తిండిని అతడికి కొంచెం పెట్టారు. ఇంటిమీద కోపంతో ఉన్న అన్నమయ్య తిరుమలకు బయల్దేరాడు. అదే అతని తిరుమల మొదటి యాత్ర. తన తిరుమల యాత్ర అనుభవాలను అన్నమయ్య అనేక కీర్తనలలో వివరించి చెప్పాడు.

దురాచారాలపై తిరుగుబాటు

అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో ఉన్నత భావాలు, సమానత్వపు భావాలు కనిపిస్తాయి. శివుడే దైవమని వీరశైవులు, విష్ణువే దేవుడని వీరవైష్ణవులు విషం కక్కుకుంటున్న పరిస్థితుల్లో బ్రహ్మం ఒక్కడే.. పరబ్రహ్మం ఒక్కడే అంటూ ప్రజల భావనల్లో ఏకత్వాన్ని నింపాడు. మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి ఒక్కటే.. చండాలుండేటి సరిభూమి ఒక్కటే.. అని కులవివక్ష తగదని ప్రబోధించాడు. పురుషులు జీవులే, కొలతులు జీవులే అని కీర్తనల్లో లింగభేదం కేవలం శరీరానికే తప్ప మిగిలిన అన్ని విషయాల్లో ఇరువురూ సమానులేనని చెప్పాడు. వేదాలు పఠించిన వారు గొప్పవారు కాదని, ఆచరించిన వారే ఉన్నతులని పేర్కొన్నాడు. వేలాది సంకీర్తనలు ఏడుకొండల వాడిపై రచించి వేంకటేశ్వరుని మహిమలను, ఏడుకొండల ఔన్నత్యాన్ని, తిరుమల విశేషాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు.



తిరుమలలో భద్రపరిచిన అన్నమయ్య సంకీర్తనలు

హుండీ పెట్టింది అన్నమయ్యే

నేడు వేలకోట్ల రూపాయలు శ్రీవారికి కానుకలు వచ్చే అత్యంత ప్రధాన ఆదాయ వనరు అయిన హుండీని శ్రీవారి ఆలయంలో పెట్టింది అన్నమయ్యే. నిజంగా ఇది అన్నమయ్యకు ఒక గొప్ప కీర్తిని తెచ్చే అంశం.

అన్నమయ్య విగ్రహం ఏర్పాటు

శ్రీ వేంకటేశ్వరస్వామి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన అన్నమాచార్యుల వంశం తాళ్లపాకలో ఒక్క కుటుంబం కూడా లేదు. కేవలం వారి ఇంటి పునాదుల వద్ద అన్నమయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎటువంటి జీవనభృతి లేకపోవడంతో ఆ వంశానికి చెందిన 11వ తరానికి చెందిన హరినారాయణాచార్యులు, సత్యనారాయణాచార్యులు తిరుమలకు వెళ్లిపోయి శ్రీవారి మేలుకొల్పు, ఏకాంతసేవలు నిర్వహిస్తున్నారు. వారికి తిరుమలలో శ్రీవారి ఆలయానికి పక్కనే గతంలో ఓ ఇల్లుండగా, మాడవీధుల ఆధునీకరణలో ఆ ఇంటిని కూడా తొలగించారు. ప్రస్తుతం ఆ కుటుంబీకులు ఒక్కరంటే ఒక్కరు కూడా తాళ్ళపాక పరిసర ప్రాంతాలలో లేరు.

తిరుమలలో అన్నమయ్య వంశీయుల ఇల్లు (ఫైల్)



తెలుసుకుందాం..

- అన్నమయ్య కీర్తనలను వెలుగులోకి తెచ్చినది - 19వ శతాబ్దంలో బ్రిటీష్ అధికారి ఎ.డి. క్యాంబెల్
- అన్నమాచార్య ప్రాజెక్టును స్థాపించినది - 1978వ సంవత్సరం
- అన్నమయ్య రాసిన మొత్తం కీర్తనలు - 32,000
- లభ్యమైన కీర్తనలు - 14,351
- తాళ్లపాకను వెలుగులోకి తెచ్చినవారు - కృష్ణంరాజు (1975)
- 108 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసినది - మే 2008
- 108 అడుగుల విగ్రహాన్ని పూర్తి చేసిన కాలం - 108 రోజులు
- 108 అడుగుల విగ్రహ శిల్పి - దేవరకొండ పెంచలయ్య, సూరిబాబు
- 108అడుగుల విగ్రహ ఏర్పాటుకు వాడిన సామగ్రి - 105 టన్నుల స్టీలు, 15వేల సిమెంటు బస్తాలు, 500 యూనిట్ల ఇసుక, 500 యూనిట్ల మెటల్, 150 మంది శిల్పులు, రూ.3.02కోట్లు ఖర్చు



అన్నమయ్య జన్మస్థలం అలనాటి తాళ్లపాక

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



మృతి చెందిన శ్రీనివాసులు (ఫైల్)

కమలాపురం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లె గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంటు పి.శ్రీనివాసులు(56) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య నరసమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

యువకుడి మృతి

మైదుకూరు రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): మైదుకూరులో పరిధిలో గుత్తి నుంచి కృష్ణపట్నానికి వెళ్లే ఫోర్ లేన్ రహదారి పనులు చేస్తున్న బీహార్‌కు చెందిన వసీమ్(23) అనే యువకుడు ఆదివారం మృతి చెందాడు. మైదుకూరు మీదుగా ఫోర్ లేన్ రహదారి పనులు జరుగుతున్నాయి. ఆ రోడ్డు పనుల్లో భాగంగా ఆదివారం కంకర మిషన్ (ఐజాక్)కు రివర్సు గైడ్‌లెన్స్ ఇస్తున్న వసీమ్ అదుపు తప్పి అదే వాహనం కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన శ్రీనివాసులు

రామసముద్రం, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఏఎస్ఐ హిమాచలపతి తెలిపారు. మండలంలోని అరికెల గ్రామ పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన ఎం.కృష్ణారెడ్డి కుమారుడు శ్రీనివాసులు(43) ద్విచక్ర వాహనంలో రామసముద్రం నుంచి వస్తుండగా కేసీపల్లె దగ్గర వాహనం అదుపు తప్పడంతో గాయపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుం బ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రహదారిలో కారు దగ్ధం



ఒంటిమిట్ట, మే 11(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై ప్రధాన రహదారిలో ఆదివారం సాయంత్రం కారు అగ్నికి ఆహుతి అయింది. నంద్యాలకు చెందిన కార్తీక్ కుటుంబ సభ్యులు తిరుపతి నుంచి నంద్యాలకు షిఫ్ట్ కారులో బయలుదేరారు. మార్గ మధ్యంలోని మండపంపల్లె వద్ద కారు అదుపు తప్పి రోడ్డుపక్కనున్న వంకలోకి వెళ్లింది. వెంటనే కారులో మంటలు వ్యాపించాయి. కారులో ప్రయాణిస్తున్నవారు వెంటనే కారు దిగి బయటకు వచ్చేయడంతో ప్రాణనష్టం జరగలేదు. సంఘటన స్థలం సమీపంలోనే సీఐ బాబు వాహనాలు తనిఖీ చేస్తుండడంతో అక్కడికి చేరుకుని కార్తీక్ కుటుంబ సభ్యులను మరో వాహనంలో పంపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్యాస్ లీక్ - ఇంటిలోని సామాన్లు దగ్ధం





కాలిపోయిన నగదు, ఫ్రిజ్

ఖాజీపేట, మే 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సరంఖాన్‌పేటలో ఉన్న కమలాపురం కదిరుల్లా గృహంలో ఆదివారం గ్యాస్ లీక్ కావడంతో ఇంటిలోని సామాన్లు దగ్ధమయ్యాయి. కుటుంబీకుల కథనం మేరకు.. ఆదివారం మధ్యాహ్నం అన్నం చేస్తుండగా గ్యాస్ లీక్ కావడాన్ని గమనించిన కదిరుల్లా భార్య బయటకు పరుగెత్తడంతో కొద్దిసేపటికిలో ఇంటిలో మంటలు భారీగా చెలరేగాయి. దాంతో ఇంటిలోని సామాన్లతో పాటు నగదు కూడా కాలిపోయింది. ఇంటిలో పిల్లలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, కాలిపోయిన వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. సమయానికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడంతో పక్క కుటుంబాలవారు ఊపిరి పీల్చుకున్నారు.

జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

నిమ్మనపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.3200 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక నాగులయ్యగారిపల్లిలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ తిప్పేస్వామి తన సిబ్బంతో కలసి దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో నలుగురిని అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం



కొండాకోనా.. ఎటుచూసినా భక్తజనం... ఎవరినోట విన్నా పెంచలో... గోవిందా..! అనే నామస్మరణే. భక్తకోటి పిలుపుతో పెనుశిల నృసింహుడు పరవశించిపోయాడు. ఆదివారం రాత్రి స్వర్ణమయకాంతులతో వెలిగిపోతున్న గరుత్మంతు డిపై కొలువుదీరిన శ్రీవారు అశేష జనవాహినిని కటాక్షించారు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగితేలారు.

- పెంచలో.. గోవిందా.. మారుమోగిన కోన గిరులు
- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కోనలో ఆదివారం నృసింహ జయంతి సందర్భంగా భక్తజనం పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో కోన కిక్కిరిసింది. క్షేత్రంలో పాత భవనాలు కూల్చివేయడంతోపాటు పలుచోట్ల రహదారుల వెడల్పుచేయడం, ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతోపాటు విస్తృతంగా చలువ పందిళ్లు వేయడంతో భక్తులు సేద తీరారు. పలువురు తలనీలాలు సమర్పించుకుని పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. మరికొందరు అన్నదానం చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేపినాపి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

సింహవాహనంపై శ్రీవారి చిద్విలాసం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారిని పరిమళ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం సింహవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో శ్రీవార్లకు హోమాలు, స్నపనతిరుంజనం, తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవలు జరిగాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, ఆకట్టుకున్నాయి.

బంగారు గరుడుడిపై ఊరేగింపు

పెనుశిల లక్ష్మీనరసింహుడు ఆదివారం రాత్రి తన ఇష్ట వాహనమైన బంగారు గరుడుడిపై ఆశీనులై మాడవీధుల్లో విహరించారు. స్వర్ణకాంతులతో మెరిసిపోతున్న పెంచలస్వామి దివ్య స్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పీర్ల సోమయ్య యాదవ్, వెంకటరామయ్య, హజరత్ నాయుడు, తోట కిష్టయ్య, భార్గవరాం, నరసింహరావు, సుగుణమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాలలో సోమవారం ఉదయం తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ, ఏకాంత సేవలు నిర్వహించనున్నారు.

గాలివాన బీభత్సం



నేలవాలిన సన్ననిమ్మ చెట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

- నేలకొరిగిన సన్ననిమ్మ, మామిడి, చీనీ చెట్లు
- రూ.20లక్షల నష్టం
- పరిశీలించిన అధికారులు, నాయకులు

చక్రాయపేట, మే 11(ఆంధ్రజ్యోతి): చక్రాయపేట మండలంలోని చలేకాంపల్లె, గడ్డంవారిపల్లె రైతులకు సంబంధించి చీనీ, సన్ననిమ్మ, మామిడిచెట్లు శనివారం రాత్రి గాలివానకు నేలకూలాయి. ఫలితంగా రూ.20లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. ఆ వివరాల్లోకెళితే.. శనివారం రాత్రి భారీ గాలులతో పాటు వర్షం కురిసింది. ఈ గాలివానకు పెద్దూరు, రెడ్డివారిపల్లె, గడ్డంవారిపల్లె, తొట్టికాడపల్లె, గొంది, మేకలవాండ్లపల్లె తదితర గ్రామాల్లో రైతులకు నష్టం వాటిల్లింది. చిలేకాంపల్లె గంగులయ్యకు చెందిన 60సన్ననిమ్మ చెట్లు, దేశాయి గంగిరెడ్డి, దేశాయి ఆదినారాయణరెడ్డి, షేక్ అబ్దుల్ ఖాదర్, బి.రమణారెడ్డి, హేమసుందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, దస్తగిరి, రాజశేఖర్‌రెడ్డి, లోమడ రామకృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి రైతులకు చెందిన దాదాపు 400 చెట్లు నేలకొరిగినట్లు సమాచారం. గాలివానకు పడిపోయిన చెట్లను వ్యవసాయ అధికారి ముబారక్‌తో పాటు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చా ర్జి బీటెక్ రవి, చక్రాయపేట మండల ఇన్ చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి పార్టీలకతీతంగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

నారాపురం వేంకటేశ్వరుడికి ధ్వజారోహణం



ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ పూజలు చేస్తున్న పండితులు

జమ్మలమడుగు, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో వెలసిన నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాను ఆదివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో పండితులు, అధికారులు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం అలంకరణ మండపంలో ఊంజల్ సేవ, అన్నమాచార్య కీర్తనలు, పెద్దశేష వాహనం, మెరువణి జరిగింది. హరికథ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు



కడప క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత దృష్ట్యా డీజీపీ ఆదేశాల మేరకు జిల్లాలో ఆదివారం సాయంత్రం ఎస్పీ పర్యవేక్షణలో రైల్వేస్టేషన్లు, బస్టాం డ్లు తదితర ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీ లు నిర్వహించారు. పలు పోలీసుస్టేషన్ల పరిధిలో, చెక్‌పోస్టుల్లో ఆయా పోలీసు లతో పాటు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక పోలీసు బృందాలు తనిఖీలు చేశారు. జిల్లా అంతటా అన్ని ముఖ్య ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీ లు కొనసాగించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

రెడ్డి, కమ్మ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బండెల గౌతమ్‌కుమార్

కడప మారుతీనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ రాష్ట్రాన్ని పాలించిన రెడ్డి, కమ్మ పార్టీల నాయకుల పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వనాశనమైందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండెల గౌతమ్‌కుమార్ ధ్వజమెత్తారు. బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇంజనీర్స్ భవన్‌లో బహుజన సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంపదను ఎలా దోచుకోవాలా... దాచుకోవాలనే తప్ప ప్రజల జీవన స్థితిగతులను మార్చాలనే ధ్యాసే ఆ రెండు వర్గాల నాయకులకు లేదన్నారు. నాటి నుండి నేటి వరకూ ఆ రెండు కులాల ప్రజలే అన్ని రంగాలలో అభివృద్ధి చెందారు తప్ప అణగారిన ప్రజలు నేటికీ బానిసలుగా అన్ని రంగాలలో వెనుకబడి వున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంథా పోవాలంటే అణగారిన వర్గాలన్నీ ఒక్కతాటిపైకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఆర్.జె. మల్లికల్, జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప, జిల్లా ఇన్‌చార్జ్ ఓబయ్య, మహిళా అధ్యక్షురాలు బేబి, నాయకులు చంద్ర, జయరామ్, జిల్లా నలుమూలల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కట్టా దొరస్వామి నాయుడు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దొరస్వామినాయుడు, పాలగిరి సిద్ధా

ములకలచెరువు, మే 11(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో ఆదివారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో కట్టా దొరస్వామినాయుడుతో కలిసి టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా తదితరులు 50 కేజీల కేక్‌ను కట్ చేసి కార్యకర్తలు, ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం కేజీఎన్ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు మెంబర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, విజయభారతి స్కూల్ కరెస్పాండెంట్ సేతు, బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ ముత్తకూరు మౌలా, జేసీబీ సుధాకర్‌నాయుడు, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

బీమాపై ఉపాధి కూలీల నిరాసక్తత

- లక్ష్యాల సాధనకు సిబ్బంది మల్లగుల్లాలు
- కూలి బకాయిలు చెల్లిస్తేనే అంటున్న కూలీలు

మదనపల్లె టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉపాధి కూలీలకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, రాష్ట్రీయ స్వస్థ బీమా యోజనపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించి, వారితో బీమా చేయించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పది రోజుల క్రితం ఉపాధిహామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. కానీ, కూలీలు మాత్రం ఈ బీమాపై ఆసక్తి కనపరచడం లేదని తెలిసింది.

మొగల్తూరు ఘటనతో అప్రమత్తం

ఉపాధిహామీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 1.20 కోట్ల మంది పనులు చేస్తున్నారు. నెల రోజుల క్రితం మొగల్తూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధి కూలీలు మృతి చెందారు. వారెవరికీ ఇన్సూరెన్స్ లేకపోవడంతో వారి కుటుంబీకులకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు వ్యక్తిగత ఇన్సూరెన్స్ కల్పించాలని పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, రాష్ట్రీయ స్వస్థ సురక్ష బీమా యోజన పథకాలను అమలు చేయాలని సూచించారు.

పీఎంఎస్‌వై, ఆర్‌ఎస్ఎస్‌వైపై కూలీలకు అవగాహన

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అన్నమయ్య జిల్లా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో పీఎంఎస్‌వై, ఆర్ఎస్ఎస్‌వై పథకాలపై కూలీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి ఈ రెండు పథకాల్లో కూలీలను సభ్యులుగా చేర్చడానికి ఉపాధి సిబ్బంది కృషి చేస్తున్నారు. ప్రధాన మంత్రి సురక్ష యోజన పథకం కింద ప్రతి లబ్ధిదారుడు రూ.20 ప్రీమియం చెల్లిస్తే ప్రమాద బీమా వర్తిస్తుంది. అలాగే ఆర్ఎస్ఎస్‌వై పథకం కింద ఒక్కో కూలీ నుంచి ఏడాదికోసారి రూ.450 చొప్పున ప్రీమియం మొత్తం సేకరించి బీమాకు దరఖాస్తు చేస్తే అటువంటి వారికి రూ.2 లక్షల ఆరోగ్యబీమా, రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. జిల్లాలో పనిచేస్తున్న ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల వద్దకు వెళ్లి ఈ రెండు పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తుల్లో వారి సంతకాలు సేకరించి, వాటిని ఆయా మండలాల పరిధిలోని బ్యాంకుల్లో ప్రీమియంలు చెల్లిస్తున్నారు.

అందని కూలి..

జిల్లాలో 4,26,858 మంది ఉపాధిహామి కూలీలుగా నమోదు చేసుకున్నారు. వీరిలో 3,12,309 మంది యాక్టివ్ వర్కర్స్ వీరికి మూడు నెలలుగా ఉపాధి కూలి అందలేదు. ఈ క్రమంలో ఇటీవల వస్తున్న పత్రికా కథనాలు, కూలీల అవస్థలు గ్రహించిన ప్రభుత్వం మార్చి 16వ తేదీ వరకు కూలి చెల్లించింది. మిగిలిన 40 రోజుల కూలి మొత్తం అందాల్సి ఉంది. ఈ క్రమంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల వద్దకు వెళ్లి పీఎంఎస్‌వై, ఆర్ఎస్ఎస్‌వై పథకాల కింద ఇన్సూరెన్స్ చేయించుకోవాలని బ్రతిమాలుతున్నా, అధిక శాతం కూలీలు ఆసక్తి చూపడం లేదు. తమకు చెల్లించాల్సిన కూలి మొత్తం ఇచ్చిన తరువాతే ఇన్సూరెన్స్ గురించి ఆలోచిస్తామంటున్నారు. గత వైసీపీ పాలనలో ఉపాధి కూలీలకు వైఎస్సార్ బీమా యోజనలో చేర్చాలని ప్రయత్నించినా, బ్యాంకర్లు సహకరించకపోవడం, సహకరించినా అక్కడ సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఆ పథకం మూలన పడింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పీఎంఎస్‌వై, ఆర్ఎస్ఎస్‌వై పథకాల కింది ఉపాధి కూలీలతో జూన్ మొదటి వారంలో బీమాలు చేయించాలని సూచనలిచ్చిన నేపథ్యంలో అది సాధ్యమవుతుందా అన్నది వేయి డాలర్ల ప్రశ్నగా మారుతోంది.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

హనుమంత వాహనంపై కోదండరామ స్వామి


హనుమంత వాహనంపై కోదండరామస్వామి

నిమ్మనపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలోని కోదండరామ స్వామి ఆలయ బ్రహోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం అభిషేకం నిర్వహించి హనుమంత వాహనంపై ఊరేగించారు. 11వ తేదీ మోహిని ఉత్సవం, ఉదయం అభిషేకం జరగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సంతానలక్ష్మికి పూజలు

గుర్రంకొండ, మే 11(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో అలంకరించి పూజలను చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకు పసరు తాగి ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం లక్ష్మీనరసింహుడి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

పెద్దతిప్పసముద్రం మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నరసింహ జయంతి సందర్భంగా లక్ష్మీ నరసింహుడి కల్యాణం నిర్వహించారు. సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను పుష్పపల్లకిలో ఊరేగించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల నడుమ స్వామి వారిని పుర వీధుల్లో ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పీటీఎంతో పాటు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు స్వామి వారి ఊరేగింపును తిలకించారు.

పెద్దమండ్యం: నరసింహస్వామి జయంతి సందర్భంగా మండలంలోని పాపేపల్లి వద్ద ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయ శుద్ధి, తోమాలసేవ, అర్చన, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి మంగళవాయిద్యాలతో మండపం వద్దకు తీసుకువెళ్లారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. గల్లానారాయణ, నాగేశ్వర, రఘునాథ శర్మ, మణికంఠశర్మ, భారతి స్వామి అర్చకులు, వేదపండితులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నిమ్మనపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మదనపల్లి మండలం కోళ్లబైలు పంచాయతీ బాబు కాలనీకి చెందిన కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మదనపల్లికి చెందిన అశోక్ కుమార్ (22), ప్రదీప్(24) శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై నేలమల్లేశ్వరాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఎగువమాచిరెడ్డిగారిపల్లి వద్ద వారి ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్ కుమార్‌కు(22) తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమర జవాన్ మురళీనాయక్‌కు నివాళి

మదనపల్లె, మే 11(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన జవాను మురళీనాయక్‌కు నియోజకవర్గ జనసేన శ్రీరామ రామాంజనేయులు నివాళులు అర్పించారు. జవాన్ స్వగ్రామంలో ఆదివారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. దేశ భద్రతకోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మురళీ నాయక్ త్యాగాన్ని ప్రశంసించారు. ఈయన వెంట మదనపల్లె జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ములకలచెరువు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం అగ్నివీర్ మార్కెట్ కమిటీ, టమోటా మండీ సిబ్బంది మురళీనాయక్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సునీల్, రాజు, సైపుల్లా, అమర, అరవింద్, అష్రఫ్, నాసర్, మస్తాన్ పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : యుద్ధంలో వీర మరణం పొందిన భారత జవాన్లకు సీనియర్‌సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం మదనపల్లె డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక జీఆర్టీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భారతీయులందరూ జవాన్లకు మద్దతు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్, ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్, ప్రొఫెసర్ శ్రీనివాసులు నాయుడు, డాక్టర్ మహమ్మద్‌గౌస్, హైదరాబాదు నుంచి వచ్చిన రవిశంకర్, శ్రీనివాస రాజు, ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ నాయకుడు శ్రీనివాసులు, తిమ్మయ్య, దనలక్ష్మి, సరస్వతి, రామచంద్రయ్య, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

ఆపరేషన్ సింధూర్‌లో అమరులైన సైనికులకు ఆదివారం హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ నిర్వాహకుడు అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ తలసీమియా వ్యాధి బాధితులకోసం ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 మంది యువకులు రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంకు ఆఫీసర్ బాలచంద్ర నాయుడు, సిబ్బంది కృష్ణ, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు పురుషోత్తం, దానకర్, కిరణ్, చైతు, సాంబ, రెడ్డి, చరణ్, దేవ, రష్మిక, సమీర్, పవన్, తదితరులు పాల్గొన్నారు. సేవాలాల్ సర్కిల్‌లో బీజేపీ గిరిజన మోర్చా అధ్యక్షుడు పిల్లస్వామి నాయక్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేత బండి ఆనంద్, భువనేశ్వర్ సత్య, మహం కిరణ్, జర్మనీరాజు, శ్రీకాంత్, వరదారెడ్డి, నారదరెడ్డి, కిరణ్, భానుప్రకాష్, పురుషోత్తం, విష్ణువర్ధన్‌రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పసుపులేటి రమాపతి మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం రెడ్డిమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు


నివాళులర్పిస్తున్న టమోటా మండీల సిబ్బంది


రక్తదానం చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

తాగునీటి సమస్యకు పరిష్కారం

కలకడ, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైందని రాతిగుంటపల్లి గ్రామస్థులు తెలిపారు. వేసవి కావడంతో గ్రామంలో తాగునీటి సమస్య ప్రారంభమైంది. దీంతో సర్పంచ్ కోనేని అలివేలు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి రెండు బోర్లు మంజూరు చేయించారు. ఆదివారం ఎగువబట్వావారిపల్లి, ముత్యాలమ్మ గుడి ప్రాంతాల్లో బోర్లు వేయగా పుష్కలంగా నీరు పడింది. అంతకు మునుపు సర్పంచ్ పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు.


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ అలివేలు

ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన

పీలేరు రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి):అధునాతన సౌకర్యాలు, ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన చేస్తున్నట్లు పీలేరు సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా పీలేరు, కలికిరి, కలకడ, రొంపిచెర్ల తదితర ప్రాంతాల్లో ఆదివారం కళాశాలలోని సౌకర్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఈ ఏడాది బీకాం, బీఏ, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్‌లు జరుగుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల సౌలభ్యం కోసం కళాశాలలో 20 వేల పుస్తకాలతో అధునాతన గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఏ కళాశాలలో ఇలాంటి గ్రంథాలయం లేదని తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందన్నారు. అధునాతన సౌకర్యాలతో ప్రయోగశాల అందుబాటులో ఉందని తెలిపారు. ఏటా ఫలితాల్లో పీలేరు ప్రభుత్వ డిగ్రీ కాలేజి అగ్రగామిగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు ఇక్కడ చదువుకొని మంచి భవిష్యత్ సాధించాలని కోరారు.

డాక్టరేట్ పొందిన దివ్యాంగులకు సన్మానం

పీలేరు రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి):డాక్టరేట్ పొందిన దివ్యాంగులను ఆదివారం స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చక్రధర్, రవికిశోర్, చిన్న, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులను సన్మానిస్తున్న స్థానికులు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

మదనపల్లె టౌన్, మే 11(ఆంధ్ర జ్యోతి): మదనపల్లె పట్టణ శివారులోని అమ్మచెరువుమిట్ట వద్ద నిర్మించిన మృత్యుంజయ శివాలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ ఈనెల 17, 18, 19 తేదీల్లో ప్రాణ ప్రతిష్ట ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, ఆనంద్, రెడ్డెప్ప, శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పద్మశాలీయులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పెద్దతిప్పసముద్రం మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.సదుం పంచాయతీలో తుమ్మరకుంట గ్రామంలో ఉన్న యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం వైదేహి వారి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో గ్రామంలోని వివిధ పల్లెల నుంచి సుమారు 100 మందికి పైగా హాజరయ్యారు. ఇందులో 15 మందికి కంటి ఆపరేషన్, ఇద్దరికి క్యాన్సర్, ఇద్దరికి ఎముకల బలహీనత, ఉన్నట్లు ఆసుపత్రి సిబ్బంది నిర్ధారించారు. వీరికి బెంగళూరు ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ములకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శారద ముని, ఏఎన్ఎం నారాయణమ్మ, ఆశ వర్కర్లు టి, భ్రమరాంబిక, సుగుణ, యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు అనిల్, ఆదర్శ, శ్రావ్య, నాని, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోపిదిన్నె, కోసువారిపల్లె తిరునాళ్లు

తంబళ్లపల్లె, మే 11(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోసువారి పల్లెలో ముత్యాలమ్మ, గోపిదిన్నె బస్టాప్ వద్ద ఉన్న ఎగువ గిండి గంగమ్మ జాతర్లను ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కాలినడకన దీలూ, బోనాలూ అమ్మవారికి సమర్పించారు. రాత్రి విద్యుద్దీపాలతో అలంకరించిన చాందినీ బండ్లు ఊరేగించారు.


కోసువారిపల్లెలోముత్యాలమ్మ అమ్మవారు

ఘనంగా గంగాకామాక్షి జాతర


విచిత్ర వేషధారణలో భక్తులు

బి.కొత్తకోట, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనుపవీధిలో ఆదివారం సాదుచెట్టి సంఘం ఆధ్వర్యంలో గంగా కామాక్షి జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. విచిత్ర వేషధారణలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గెరిగిఉత్సవం నిర్వహించారు. సాదుచెట్టి సంఘం సభ్యులు, పట్టణప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కత్తితో దాడి.. ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, మే11(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎస్టేట్‌లోని ఓ మద్యం దుకాణం వద్ద ఓ వ్యక్తిపై మరొక వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. మదనపల్లె పట్టణం గొల్లపల్లెకు చెందిన నాగరాజు (50)ఆదివారం ఎస్టేట్‌లోని మద్యం షాపునకు వెళ్లాడు. అక్కడ చలపతి అనే వ్యక్తితో మాటామాటా పెరిగి గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన చలపతి తన వద్ద ఉన్న కత్తితో దాడికి యత్నించాడు. తప్పించుకుని పారిపోతున్న నాగరాజును తరిమి మరీ దాడి చేశాడు. దీంతో తీవ్ర ంగా గాయపడిన నాగరాజును కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మదనపల్లె టూటౌన్ పోలీసులు తెలిపారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించండి

మదనపల్లె టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): షిర్డి సాయిబాబా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. ఆదివారం పట్టణంలోని షిర్డిసాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మున్సిపల్ కౌన్సిలర్ తులసీ, రామకృష్ణాచారి, ఆలయ నిర్వాహకులు రెడ్డెప్ప రావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


సాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

హజ్ యాత్రికులు క్షేమంగా వెళ్లిరావాలి

మదనపల్లె నుంచి హజ్‌యాత్రకు వెళుతున్న భక్తులు క్షేమంగా వెళ్లిరావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆకాంక్షించారు. ఆదివారం బెంగళూరుకు వెళుతున్న 56 మంది హజ్ యాత్రికులకు ఎమ్మెల్యే వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హజ్‌యాత్రికుల కోసం బెంగళూరు నుంచి ప్రత్యేక వసతులతో విమాన సౌకర్యం కల్పించిందన్నారు. హజ్‌యాత్రలో భక్తులు బెంగళూరు నుంచి జెద్దాకు వెళ్లి అక్కడ నుంచి మక్కా, మదీనా దర్శించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్‌ఖాదర్ ఖాన్, ముస్లింలు పాల్గొన్నారు.

టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

గుర్రంకొండ, మే 11(ఆంధ్రజ్యోతి):టమోటాకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండు చేశారు. మండలంలోని తరిగొండలో ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టమోటా ధరలు లేక రైతన్నలు అప్పుల ఊబిలో చిక్కుకున్నారని తెలిపారు. టమోటాకు గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండు చేశారు. ఉపాధి కూలీల పని దినాలను 200 రోజులకు పెంచాలని కోరారు. కనీస వేతనం రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, నాయకులు రమణారెడ్డి, రామచంద్ర, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

గిన్నిస్‌బుక్‌లో మదనపల్లె వాసులకు స్థానం

మదనపల్లె, మే 11(ఆంధ్రజ్యోతి): మ్యూజిక్ కాంపిటీషన్‌లో మదనపల్లె వాసులకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. స్థానిక సీఎస్ఐ జేసీఎం చర్చి పాస్టర్ డాక్టర్ రెవరెండ్ సునీల్‌వర కుమార్ భార్య లూసి మేరీ, సంఘ సభ్యులు కళ్యాణి, ప్రసన్న, రంజిత్ సుధీర్‌లు విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజికల్ స్కూల్ వ్యవస్థాపకుడు పాస్టర్ అగస్టీన్ దండింగి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో 18దేశాలకు చెందిన 1,090 మంది ప్రాతినిధ్యం వహించగా, 1,046 మంది విజయం సాధించిన వారిలో మదనపల్లె వాసులు ఉన్నారు. ఈ సందర్భంగా శనివారం బెంగళూరులో పాస్టర్ అగస్టీన్ దండంగి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. విజేతలను స్థానిక సీఎస్ఐ జేసీఎం చర్చి సభ్యులు అభినందించారు.


గిన్నిస్ రికార్డు సాధించిన మదనపల్లె వాసులు

విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవాలి

మదనపల్లె అర్బన్, మే11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వినయ, విధేయత, క్రమశిక్షణలను పెంపొందించుకోవాలని సెంట్రల్ సిల్క్ బోర్డు మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ దీప అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పెద్దలపై గౌరవం, సమాజంలో ఎలా మెలగాలనే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మంచి నడవడికే తమ భవిష్యత్‌ను నిర్దేశిస్తుందన్నారు. విద్యార్థులు తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. అనంతరం డాక్టర్‌ను గ్రంథాలయాధికారిణి దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డెప్ప, మదన్‌మోహన్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


డాక్టర్ దీపను సన్మానిస్తున్న గ్రంథాలయ అధికారిణి

కనీస వేతనం రూ. 35 వేలు చెల్లించాలి

మదనపల్లె అర్బన్, మే11(ఆంధ్రజ్యోతి):కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.35వేలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మురళి కోరారు. ఆదివారం స్థానిక నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోదీ మతోన్మాద ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చడానికి నాలుగు లేబర్ కోడ్ల చట్టాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసీ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్‌లో పని చేసే ఉద్యోగులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కృష్ణప్ప, ఏఐటీయూసీ నాయకులు ముబారక్, తిరుమల, రెడ్డెప్ప, నాగరాజ, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డే అర్జీలకు సమయం కేటాయించండి

పెద్దమండ్యం, మే 11(ఆంధ్రజ్యోతి) గ్రీవెన్స్ డే సందర్భంగా స్వీకరించిన అర్జీల పరిష్కారా నికి అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్ డే కార్యక్రమాల సందర్భంగా అధికారులు వీసీల్లో ఉంటూ తమను పట్టించుకోవడం లేదంటున్నారు. దీంతో ప్రజలు సాయంత్రం వరకు కార్యాలయాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రీవెన్స్ డే సోమవారం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి ఉదయం వేళ ల్లో 11 గంటలు 12 గంటల మధ్య అర్జీలను స్వీకరించాలన్నారు. ప్రజా సమస్యలపై ఇచ్చే అర్జీలకు రసీదులు కూడా ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

మహల్ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల కలయిక

కలికిరి, మే 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మహల్ తెలుగు ఉన్నత పాఠశాలలో 1985- 86 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులు ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని సందడి చేశారు. పూర్వ విద్యార్థులంద రూ కలిసి పాఠశాల అభివృద్ధికి సహక రించాలని తీర్మానించారు. తమకు విద్య నేర్పిన అలనాటి గురువులు పి.రెడ్డెప్ప రెడ్డి, జి. శ్రీనివాసులు రెడ్డి, కె.ఆనంద రెడ్డి. పి.బ్రహ్మారెడ్డిని ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆ కాలం చదువుల తీరుతెన్నులను నెమరేసుకున్నారు. దాదాపు 50 మంది పూర్వ విద్యార్థులు నలభై ఏళ్ల తరువాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మహల్ పూర్వ విద్యార్థులు

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిని కలిసిన డీవీఎంసీ సభ్యులు

పీలేరు, మే 11(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లె రామచందర్‌ను ఆదివారం అన్నమయ్య జిల్లా డీవీఎంసీ సభ్యుడు పాలకుంట శ్రీనివాసులు, చిత్తూరు డీవీఎంసీ సభ్యుడు రాజ్ కుమార్ కాణిపాకంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అన్న మయ్య, చిత్తూరు జిల్లాల్లో ఎస్సీ అట్రాసిటీ కేసుల నమోదు, విచారణలో జాప్యాన్ని నివారించాలని కోరారు. త్వరలోనే తాను రాయలసీమ జిల్లాల్లో పర్యటించి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు.


రామచందర్‌తో పాలకుంట శ్రీనివాసులు, రాజ్ కుమార్

దేశ రక్షణ కోసం నృసింహ స్తోత్ర పారాయణం

మదనపల్లె అర్బన్, మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కురవంకలోని శంకరబ్రాహ్మణ సేవా సహకార సమితిలో ఆదివారం ఈ సేవా సమితి అధ్యక్షుడు కోదండ రామయ్య ఆధ్వర్యంలో దేశరక్షణ కోసం లక్ష్మీనృసింహ కరుణారస స్తోత్ర పారాయణం చేశామని తెలిపారు. దేశ రక్షన కోసం, సనాతన ధర్మాలైన హిందూ ధర్మాన్ని నమ్ముకున్న వాళ్లపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. ఇక్కడ అందరూ దేశ రక్షణ కోసం మూడు పర్యాయాలు స్తోత్రం పారాయణం చేశారని అన్నారు. కార్యక్రమంలో శంకరబ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, బ్రాహ్మణులు పాల్గొన్నారు.



జో అచ్యుతానంద... జో జో ముకుందా...
లాలి పరమానంద... రామగోవిందా

అమ్మ పాడే ఈ జోలపాట వింటూ హాయిగా నిద్రపోని బాల్యాన్ని ఊహించగలమా..

చందమామ రావే.. జాబిల్లి రావే..

అమ్మగొంతులోంచి ఈ చల్లని పాట వింటూ గోరుముద్దలు తినని వారెవరైనా తెలుగు నేలమీద ఉంటారా..

ఇటువంటి సంకీర్తన రచనలతో ఆబాలగోపాలాన్ని అలరించిన తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు ఈనెల 12వ తేదీ సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ సందర్భంగా అన్నమయ్యపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



తాళ్లపాక అన్నమయ్య కీర్తిని చాటిచెప్పిన కృష్ణంరాజు స్థూపం

భలే అల్లరోడే.. మహాపండితుడాయె..

- మానవతావాది... బహుముఖ ప్రజ్ఞాశాలి
- నేటి నుంచి తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతి ఉత్సవాలు

రాజంపేట, మే 11(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య చిన్నప్పుడు మహా అల్లరి పిల్లవాడు. ఎప్పుడూ ఆటలూ పాటలే. ఇంట్లో ఎవరికీ అది నచ్చేది కాదు. వదిన మందలింపులు ఎక్కువ. ఒకసారి అన్నమయ్యను గడ్డి కోసుకు రమ్మని అడవికి పంపింది. కాదనలేక వదినను తిట్టుకుంటూ అడవికి వెళ్లాడు. గడ్డి కోస్తుండగా చిటికిన వేలు తెగి రక్తం ధారలై కారింది. ఇష్టం లేని చెప్పిందన్న కోపం... గాయం సలుపుతున్న బాధతో కన్నీటి పర్యంతమయ్యాడు. అదే సమయంలో గోవింద నామస్మరణలు ఆ అడవిలో అన్నమయ్యకు వినిపించాయి. తిరుమలకు కాలినడకన వెళ్తున్న భక్తబృందాలు ఏడుస్తున్న బాలుడిని ఓదార్చి తెచ్చుకున్న తిండిని అతడికి కొంచెం పెట్టారు. ఇంటిమీద కోపంతో ఉన్న అన్నమయ్య తిరుమలకు బయల్దేరాడు. అదే అతని తిరుమల మొదటి యాత్ర. తన తిరుమల యాత్ర అనుభవాలను అన్నమయ్య అనేక కీర్తనలలో వివరించి చెప్పాడు.

దురాచారాలపై తిరుగుబాటు

అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో ఉన్నత భావాలు, సమానత్వపు భావాలు కనిపిస్తాయి. శివుడే దైవమని వీరశైవులు, విష్ణువే దేవుడని వీరవైష్ణవులు విషం కక్కుకుంటున్న పరిస్థితుల్లో బ్రహ్మం ఒక్కడే.. పరబ్రహ్మం ఒక్కడే అంటూ ప్రజల భావనల్లో ఏకత్వాన్ని నింపాడు. మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి ఒక్కటే.. చండాలుండేటి సరిభూమి ఒక్కటే.. అని కులవివక్ష తగదని ప్రబోధించాడు. పురుషులు జీవులే, కొలతులు జీవులే అని కీర్తనల్లో లింగభేదం కేవలం శరీరానికే తప్ప మిగిలిన అన్ని విషయాల్లో ఇరువురూ సమానులేనని చెప్పాడు. వేదాలు పఠించిన వారు గొప్పవారు కాదని, ఆచరించిన వారే ఉన్నతులని పేర్కొన్నాడు. వేలాది సంకీర్తనలు ఏడుకొండల వాడిపై రచించి వేంకటేశ్వరుని మహిమలను, ఏడుకొండల ఔన్నత్యాన్ని, తిరుమల విశేషాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు.



తిరుమలలో భద్రపరిచిన అన్నమయ్య సంకీర్తనలు

హుండీ పెట్టింది అన్నమయ్యే

నేడు వేలకోట్ల రూపాయలు శ్రీవారికి కానుకలు వచ్చే అత్యంత ప్రధాన ఆదాయ వనరు అయిన హుండీని శ్రీవారి ఆలయంలో పెట్టింది అన్నమయ్యే. నిజంగా ఇది అన్నమయ్యకు ఒక గొప్ప కీర్తిని తెచ్చే అంశం.

అన్నమయ్య విగ్రహం ఏర్పాటు

శ్రీ వేంకటేశ్వరస్వామి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన అన్నమాచార్యుల వంశం తాళ్లపాకలో ఒక్క కుటుంబం కూడా లేదు. కేవలం వారి ఇంటి పునాదుల వద్ద అన్నమయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎటువంటి జీవనభృతి లేకపోవడంతో ఆ వంశానికి చెందిన 11వ తరానికి చెందిన హరినారాయణాచార్యులు, సత్యనారాయణాచార్యులు తిరుమలకు వెళ్లిపోయి శ్రీవారి మేలుకొల్పు, ఏకాంతసేవలు నిర్వహిస్తున్నారు. వారికి తిరుమలలో శ్రీవారి ఆలయానికి పక్కనే గతంలో ఓ ఇల్లుండగా, మాడవీధుల ఆధునీకరణలో ఆ ఇంటిని కూడా తొలగించారు. ప్రస్తుతం ఆ కుటుంబీకులు ఒక్కరంటే ఒక్కరు కూడా తాళ్ళపాక పరిసర ప్రాంతాలలో లేరు.

తిరుమలలో అన్నమయ్య వంశీయుల ఇల్లు (ఫైల్)



తెలుసుకుందాం..

- అన్నమయ్య కీర్తనలను వెలుగులోకి తెచ్చినది - 19వ శతాబ్దంలో బ్రిటీష్ అధికారి ఎ.డి. క్యాంబెల్
- అన్నమాచార్య ప్రాజెక్టును స్థాపించినది - 1978వ సంవత్సరం
- అన్నమయ్య రాసిన మొత్తం కీర్తనలు - 32,000
- లభ్యమైన కీర్తనలు - 14,351
- తాళ్లపాకను వెలుగులోకి తెచ్చినవారు - కృష్ణంరాజు (1975)
- 108 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసినది - మే 2008
- 108 అడుగుల విగ్రహాన్ని పూర్తి చేసిన కాలం - 108 రోజులు
- 108 అడుగుల విగ్రహ శిల్పి - దేవరకొండ పెంచలయ్య, సూరిబాబు
- 108అడుగుల విగ్రహ ఏర్పాటుకు వాడిన సామగ్రి - 105 టన్నుల స్టీలు, 15వేల సిమెంటు బస్తాలు, 500 యూనిట్ల ఇసుక, 500 యూనిట్ల మెటల్, 150 మంది శిల్పులు, రూ.3.02కోట్లు ఖర్చు



అన్నమయ్య జన్మస్థలం అలనాటి తాళ్లపాక

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



మృతి చెందిన శ్రీనివాసులు (ఫైల్)

కమలాపురం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లె గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంటు పి.శ్రీనివాసులు(56) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య నరసమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

యువకుడి మృతి

మైదుకూరు రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): మైదుకూరులో పరిధిలో గుత్తి నుంచి కృష్ణపట్నానికి వెళ్లే ఫోర్ లేన్ రహదారి పనులు చేస్తున్న బీహార్‌కు చెందిన వసీమ్(23) అనే యువకుడు ఆదివారం మృతి చెందాడు. మైదుకూరు మీదుగా ఫోర్ లేన్ రహదారి పనులు జరుగుతున్నాయి. ఆ రోడ్డు పనుల్లో భాగంగా ఆదివారం కంకర మిషన్ (ఐజాక్)కు రివర్సు గైడ్‌లెన్స్ ఇస్తున్న వసీమ్ అదుపు తప్పి అదే వాహనం కిందపడి అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన శ్రీనివాసులు

రామసముద్రం, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఏఎస్ఐ హిమాచలపతి తెలిపారు. మండలంలోని అరికెల గ్రామ పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన ఎం.కృష్ణారెడ్డి కుమారుడు శ్రీనివాసులు(43) ద్విచక్ర వాహనంలో రామసముద్రం నుంచి వస్తుండగా కేసీపల్లె దగ్గర వాహనం అదుపు తప్పడంతో గాయపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుం బ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రహదారిలో కారు దగ్ధం



ఒంటిమిట్ట, మే 11(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై ప్రధాన రహదారిలో ఆదివారం సాయంత్రం కారు అగ్నికి ఆహుతి అయింది. నంద్యాలకు చెందిన కార్తీక్ కుటుంబ సభ్యులు తిరుపతి నుంచి నంద్యాలకు షిఫ్ట్ కారులో బయలుదేరారు. మార్గ మధ్యంలోని మండపంపల్లె వద్ద కారు అదుపు తప్పి రోడ్డుపక్కనున్న వంకలోకి వెళ్లింది. వెంటనే కారులో మంటలు వ్యాపించాయి. కారులో ప్రయాణిస్తున్నవారు వెంటనే కారు దిగి బయటకు వచ్చేయడంతో ప్రాణనష్టం జరగలేదు. సంఘటన స్థలం సమీపంలోనే సీఐ బాబు వాహనాలు తనిఖీ చేస్తుండడంతో అక్కడికి చేరుకుని కార్తీక్ కుటుంబ సభ్యులను మరో వాహనంలో పంపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్యాస్ లీక్ - ఇంటిలోని సామాన్లు దగ్ధం



కాలిపోయిన నగదు, ఫ్రిజ్

ఖాజీపేట, మే 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సరంఖాన్‌పేటలో ఉన్న కమలాపురం కదిరుల్లా గృహంలో ఆదివారం గ్యాస్ లీక్ కావడంతో ఇంటిలోని సామాన్లు దగ్ధమయ్యాయి. కుటుంబీకుల కథనం మేరకు.. ఆదివారం మధ్యాహ్నం అన్నం చేస్తుండగా గ్యాస్ లీక్ కావడాన్ని గమనించిన కదిరుల్లా భార్య బయటకు పరుగెత్తడంతో కొద్ది సేపటికిలో ఇంటిలో మంటలు భారీగా చెలరేగాయి. దాంతో ఇంటిలోని సామాన్లతో పాటు నగదు కూడా కాలిపోయింది. ఇంటిలో పిల్లలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, కాలిపోయిన వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. సమయానికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడంతో పక్క కుటుంబాలవారు ఊపిరి పీల్చుకున్నారు.

జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

నిమ్మనపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.3200 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక నాగులయ్యగారిపల్లిలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ తిప్పేస్వామి తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో నలుగురిని అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం

- పెంచలలో.. గోవిందా.. మారుమోగిన కోన గిరులు
- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం



కొండాకోనా.. ఎటుచూసినా భక్తజనం... ఎవరినోట విన్నా పెంచలలో... గోవిందా..! అనే నామస్మరణే. భక్తకోటి పిలుపుతో పెనుశిల నృసింహుడు పరవశించిపోయాడు. ఆదివారం రాత్రి స్వర్ణమయకాంతులతో వెలిగిపోతున్న గరుత్మంతుడిపై కొలువుదీరిన శ్రీవారు అశేష జనవాహినిని కటాక్షించారు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగితేలారు.

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కోనలో ఆదివారం నృసింహ జయంతి సందర్భంగా భక్తజనం పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో కోన కిక్కిరిసింది. క్షేత్రంలో పాత భవనాలు కూల్చివేయడంతోపాటు పలు చోట్ల రహదారుల వెడల్పుచేయడం, ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతోపాటు విస్తృతంగా చలువ పందిళ్ల వేయడంతో భక్తులు సేద తీరారు. పలువురు తలనీలాలు సమర్పించుకుని పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. మరికొందరు అన్నదానం చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేపినాపి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

సింహవాహనంపై శ్రీవారి చిద్విలాసం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారిని పరిమళ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం సింహవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో శ్రీవార్లకు హోమాలు, స్నపనతిరుంజనం, తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవలు జరిగాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, ఆకట్టుకున్నాయి.

బంగారు గరుడుడిపై ఊరేగింపు

పెనుశిల లక్ష్మీనరసింహుడు ఆదివారం రాత్రి తన ఇష్ట వాహనమైన బంగారు గరుడుడిపై ఆశీనులై మాడవీధుల్లో విహరించారు. స్వర్ణకాంతులతో మెరిసిపోతున్న పెంచలస్వామి దివ్య స్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు వీర్ల సోమయ్య యాదవ్, వెంకటరామయ్య, హజరత్ నాయుడు, తోట కిష్టయ్య, భార్గవరాం, నరసింహరావు, సుగుణమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాలలో సోమవారం ఉదయం తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ, ఏకాంత సేవలు నిర్వహించనున్నారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన సన్ననిమ్మ, మామిడి, చీనీ చెట్లు
- రూ.20లక్షల నష్టం
- పరిశీలించిన అధికారులు, నాయకులు



నేలవాలిన సన్ననిమ్మ చెట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

చక్రాయపేట, మే 11(ఆంధ్రజ్యోతి): చక్రాయపేట మండలంలోని చలేకాంపల్లె, గడ్డంవారిపల్లె రైతులకు సంబంధించి చీనీ, సన్ననిమ్మ, మామిడిచెట్లు శనివారం రాత్రి గాలివానకు నేలకూలాయి. ఫలితంగా రూ.20లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. ఆ వివరాల్లోకెళితే.. శనివారం రాత్రి భారీ గాలులతో పాటు వర్షం కురిసింది. ఈ గాలివానకు పెద్దూరు, రెడ్డివారిపల్లె, గడ్డంవారిపల్లె, తొట్టికాడపల్లె, గొంది, మేకలవాండ్లపల్లె తదితర గ్రామాల్లో రైతులకు నష్టం వాటిల్లింది. చిలేకాంపల్లె గంగులయ్యకు చెందిన 60సన్ననిమ్మ చెట్లు, దేశాయి గంగిరెడ్డి, దేశాయి ఆదినారాయణరెడ్డి, షేక్ అబ్దుల్ ఖాదర్, బి.రమణారెడ్డి, హేమసుందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, దస్తగిరి, రాజశేఖర్‌రెడ్డి, లోమడ రామకృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి రైతులకు చెందిన దాదాపు 400 చెట్లు నేలకొరిగినట్లు సమాచారం. గాలివానకు పడిపోయిన చెట్లను వ్యవసాయ అధికారి ముబారక్‌తో పాటు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చా ర్జి బీటెక్ రవి, చక్రాయపేట మండల ఇన్ చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి పార్టీలకతీతంగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

నారాపురం వేంకటేశ్వరుడికి ధ్వజారోహణం



ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ పూజలు చేస్తున్న పండితులు

జమ్మలమడుగు, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో వెలసిన నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాను ఆదివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో పండితులు, అధికారులు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం అలంకరణ మండపంలో ఊంజల్ సేవ, అన్నమాచార్య కీర్తనలు, పెద్దశేష వాహనం, మెరువణి జరిగింది. హరికథ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు



కడప క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత దృష్ట్యా డీజీపీ ఆదేశాల మేరకు జిల్లాలో ఆదివారం సాయంత్రం ఎస్పీ పర్యవేక్షణలో రైల్వేస్టేషన్లు, బస్టాం డ్లు తదితర ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీ లు నిర్వహించారు. పలు పోలీసుస్టేషన్ల పరిధిలో, చెక్‌పోస్టుల్లో ఆయా పోలీసు లతో పాటు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక పోలీసు బృందాలు తనిఖీలు చేశారు. జిల్లా అంతటా అన్ని ముఖ్య ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీ లు కొనసాగించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

రెడ్డి, కమ్మ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్

కడప మారుతీనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ రాష్ట్రాన్ని పాలించిన రెడ్డి, కమ్మ పార్టీల నాయకుల పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వనాశనమైందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ధ్వజమెత్తారు. బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇంజనీర్స్ భవన్‌లో బహుజన సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంపదను ఎలా దోచుకోవాలా... దాచుకోవాలనే తప్ప ప్రజల జీవన స్థితిగతులను మార్చాలనే ధ్యాసే ఆ రెండు వర్గాల నాయకులకు లేదన్నారు. నాటి నుండి నేటి వరకూ ఆ రెండు కులాల ప్రజలే అన్ని రంగాలలో అభివృద్ధి చెందారు తప్ప అణగారిన ప్రజలు నేటికీ బానిసలుగా అన్ని రంగాలలో వెనుకబడి వున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంథా పోవాలంటే అణగారిన వర్గాలన్నీ ఒక్క తాటిపైకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఆర్.జె. మల్లికల్, జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప, జిల్లా ఇన్‌చార్జ్ ఓబయ్య, మహిళా అధ్యక్షురాలు బేబి, నాయకులు చంద్ర, జయరామ్, జిల్లా నలుమూలల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కట్టా దొరస్వామి నాయుడు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దొరస్వామినాయుడు, పాలగిరి సిద్ధా

ములకలచెరువు, మే 11(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో ఆదివారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో కట్టా దొరస్వామినాయుడుతో కలిసి టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా తదితరులు 50 కేజీల కేక్‌ను కట్ చేసి కార్యకర్తలు, ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం కేజీఎన్ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, వక్ఫ్ బోర్డు మెంబర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, విజయభారతి స్కూల్ కరెస్పాండెంట్ సేతు, బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ ముత్తకూరు మౌలా, జేసీబీ సుధాకర్‌నాయుడు, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగరాళ్లకు జలాభిషేకం



జల కలశాలతో ప్రదర్శనగా బయలుదేరిన మహిళలు

వాల్మీకిపురం, మే 11(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో వెలసిన నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో వేకువజామున అమ్మవారికి అభిషేకం, అర్చన, తోమాలసేవలతో పాటు ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఆలయం నుండి జలకలశాలతో మహిళలు బయలుదేరగా మంగళవాయిద్యాలు, విశేష భక్తజనం నడుమ జలకలశాల ప్రదర్శన వేడుకగా సాగింది. పట్టణంలోని బజారువీధి, నాయక్‌వీధులలో ఉన్న గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. తిరిగి ప్రదర్శగా బయలుదేరి అమ్మవారికి ఆలయానికి చేరుకుని మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మరో వారం రోజులపాటు నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతర మహోత్సవాలు వేడుకగా జరగనున్నాయి. కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త మొర్రంరెడ్డి రామ్‌కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రమణారెడ్డి, ఆనందశెట్టి, బలరామ్, బొక్కసం బ్రదర్స్, టమోటా రామచంద్ర, శేర్, ఆదినారాయణ, పులి బ్రదర్స్, అర్చకులు జనార్దనస్వామి, భక్తులు పాల్గొన్నారు.